సాక్షి
వికారాబాద్
గురువారం । 19 । జనవరి । 2023











ఫుల్.. గిల్.. చిల్

ఉప్పల్‌లో ఉప్పొంగిన అభిమానం.. ఉత్కంఠ పోరులో ఉరిమిన ఉత్సాహం

ఉప్పల్ స్టేడియంలో పరుగుల ఉప్పెన ఎగిసింది. మధ్యాహ్నం ఎండలో.. సాయంత్రం చలిగాలిలో.. రాత్రి చుక్కల ఆకాశంలో.. అభిమానులు ప్రతి పరుగునూ, ప్రతి బంతినీ ఆస్వాదించారు. ముందుగా శుభ్‌మన్ గిల్ పరుగుల వరదకు.. అనంతరం 'లోకల్ బాయ్' సిరాజ్ నిప్పులు చెరిగే బంతులకు.. చివర్లో న్యూజిలాండ్ బ్యాటర్ మైకేల్ బ్రేస్‌వెల్ పోరాట పటిమకు ముగ్ధులయ్యారు. వెరసి.. హైదరాబాద్‌లో భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్ సూపర్ హిట్ అయ్యింది. అభిమానులు వెచ్చించిన ప్రతి పైసాకు ఫుల్ వినోదం లభించింది. ఇప్పటి వరకు భాగ్యనగరంలో న్యూజిలాండ్‌తో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోలేదు. ఈసారీ అదే ఆనవాయితీని టీమ్ ఇండియా కొనసాగించింది. తన అజేయ రికార్డును నిలబెట్టుకుంది.

– సాక్షి, సిటీబ్యూరో/ఉప్పల్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్ఎం

తాండూరు టౌన్ : ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ పరిధిలోని బస్సు సర్వీసుల విషయమై గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండుల నుంచి బయలుదేరే జిల్లా బస్సు సర్వీసులతో పాటు హైదరాబాద్-1, -2, పికెట్, మియాపూర్-1, బీహెచ్ఈఎల్, పరిగి, తాండూరు, వికారాబాద్ డిపోలకు సంబంధించిన బస్సు సర్వీసుల సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26241 నంబర్‌కు డయల్ చేసి తెలపాలన్నారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీమార్ట్, బాటా, స్పిన్ని కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఆసక్తి ఉండి ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న వాళ్లు జాబ్ మేళాలో పాల్గొనాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 96760 47444 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి



బీజేపీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పుతున్న సదానంద్‌రెడ్డి

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించడం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో ఆయన సమక్షంలో పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులవుతూ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో సమస్యలు పరిష్కారించేలా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, జిల్లా దళితమోర్చా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, పరిగి అసెంబ్లీ కన్వీనర్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

28న సైన్స్ సెమినార్

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న ఉపాధ్యాయ, అధ్యాపకులకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. టీశాట్ ద్వారా ఈ నెల 19న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పేపర్ ఎలా సిద్ధం చేసుకోవాలనేదానిపై టెలికాన్ఫరెన్స్ ఉంటుందన్నారు.

అర్హులు 600లోపే!

ఏడాది గడిచినా పోడు భూముల వ్యవహారం కొలిక్కి రావడంలేదు. దరఖాస్తుల పరిశీలన గడువు పొడిగిస్తూనే ఉన్నారు. గత ఏడాది నవంబర్ 15లోపే దరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తామన్న అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం. దరఖాస్తులు 9వేలు దాటినా అర్హులు 600లోపే ఉన్నట్టు సమాచారం. మరోవైపు నేతల ఒత్తిడి పెరుగుతుండటంతో అయోమయానికి గురవుతున్నారు. సర్వేయర్ల కొరతతోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

పోడు తేలదు.. గోస తీరదు

- అర్హులను ప్రకటించడంలో మీనమేషాలు
- ఏడాది గడిచినా కొలిక్కిరాని వ్యవహారం
- మూడు నెలలుగా సాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- మరోవైపు కొనసాగుతున్న అటవీ భూముల కబ్జాలు



చదును చేసిన పోడు భూమి

వికారాబాద్: పోడు భూముల విషయమై ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి ఏడాది గడిచింది. మూడు నెలలుగా దరఖాస్తులను అటవీ సంరక్షణ కమిటీల ఆధ్వర్యంలో పరిశీలిస్తూనే ఉన్నారు. గడువు ముగిసినా అర్హులను ప్రకటించే విషయంలో నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నారు. ఫలితంగా గిరిజనుల్లో పొడిచిన పోడు ఆశలు అడియాశలుగానే మిగిలాయి.

అయోమయంలో అధికారులు

రైతులకు అవగాహన లేక చాలా మంది పోడు రైతులు దరఖాస్తు చేసుకోలేదని మరోసారి అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో ఇటీవల వందల సంఖ్యలో తరలివచ్చిన రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన సైతం చేపట్టారు. ఇదే సమయంలో లబ్ధిదారుల జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుండటంతో అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి సైతం పెరుగుతోంది. తమకు కావాల్సిన వారికి పోడు భూములు ఎలాగైనా ఇప్పించాలనే పట్టుదలతో నేతలు, ప్రజా ప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం కొన్ని చోట్ల తాయిలాల పర్వానికి కూడా తెరతీసినట్టు తెలుస్తోంది. అయితే ఈ కమిటీల్లో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండటంతో ఎంపిక విధానం నిజమైన పోడు రైతులకు కాకుండా అధికార పార్టీ అనుకూల వ్యక్తులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నేతల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అటవీ భూములను యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉంటే.. పోడు హక్కులు కల్పించే ప్రక్రియతో అడవి ప్రాంతాన్ని కుచించుకుపోకుండా ఉండేందుకు అటవీ శాఖ అధికారులు నానా తంటాలు పడుతుండటం విశేషం.

9వేలకు పైగా దరఖాస్తులు

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్న విషయం విదితమే. అధికారులు అటవీ ప్రాంతాలతో సంబంధం ఉన్న 126 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 133 గ్రామాల్లో అటవీ సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఊహించనివిధంగా 21,761 ఎకరాల్లో కబ్జాలో ఉన్నట్టు 9,647 మంది పోడు రైతులు పోడు హక్కుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అటవీ సంరక్షణ చట్టంలో పొందుపరిచిన నిబంధనలను బట్టి చూస్తే పోడు రైతులనుంచి జిల్లాలో వచ్చిన దరఖాస్తులలో పది శాతంలోపు దరఖాస్తులకే ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అటవి సంరక్షణ నిబంధనల ప్రకారం 2005 ఏడాది కంటే ముందు నుంచే అటవీ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో 2006 ఏడాదికి 70 ఏళ్ల ముందు నుంచే గిరిజనేతరులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తుంటే వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అయితే 2006-08 మధ్య కాలంలో జిల్లాలో అప్పటి వరకు కబ్జాలో ఉన్న 672 మంది గిరిజనేతరులకు అప్పటి ప్రభుత్వం పోడు హక్కులు కల్పించినట్టు రికార్డులు చెబుతున్నాయి. అంటే ప్రస్తుత పోడు హక్కు దారుల జాబితాలో గిరిజనేతరుల దరఖాస్తులు పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదు. జిల్లాలో మొత్తం 9,647 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 4,804 మంది గిరిజనేతరులు దరఖాస్తులు చేసుకోగా 4,843 మంది గిరిజనులు పోడు హక్కుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది గిరిజనులు మైనర్లుగా ఉండటం తదితర కాణాలతో జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో పదిశాతంలోపే ఆమోదం పొందే అవకాశం ఉంది. వికారాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 400 పైచిలుకు, తాండూరు డివిజన్‌ల వంద పైచిలుకు మొత్తం 600 లోపే అర్హులుగా ఉన్నట్లు తెలుస్తోంది.

పోడు హక్కుల కోసం వచ్చిన దరఖాస్తులు:	9,647
కబ్జాలో ఉన్న అటవీ భూములు ఎకరాల్లో..:	21,761

తుదిదశలో పరిశీలన



అటవీ సంరక్షణ కమిటీల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన తుదిదశకు వచ్చింది. కొందరు అవగాహన లేకనో.. ఇతరులు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనో ఇటీవల అడవులు నరికి చదును చేస్తున్నారు. అలాంటి చర్యలు ఉపేక్షించం. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం. అటవీ భూములను ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు. నిబంధనల ప్రకారం పోడు హక్కులు కల్పించేందుకు ప్రయత్నిస్తాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎఫ్ఓ



సమీక్షలో కలెక్టర్ నిఖిల, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

అంధత్వం నివారిద్దాం రండి

నేటి నుంచి 'కంటి వెలుగు'

- అన్ని సెంటర్లలోనూ శిబిరాల నిర్వహణ
- మౌలిక వసతులు కల్పించాలి
- 'గూగుల్ మీట్'లో అధికారులకు కలెక్టర్ నిఖిల దిశానిర్దేశం

వికారాబాద్ అర్బన్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు, కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా విజయవంతం చేయాలని కలెక్టర్ నిఖిల ఆయా మండలాల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి గూగుల్ మీట్ ద్వారా వైద్య అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంధత్వ నివారణ అందరి లక్ష్యం కావాలన్నారు. కంటి వెలుగు శిబిరాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కుర్చీలు, టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఏ గ్రామంలో, వార్డుల్లో ఎప్పుడు కంటి పరీక్షలు చేస్తారో ముందుగానే ప్రచారం చేయాలని సూచించారు. ఉదయం 9 గంటలకు జిల్లాలోని అన్ని సెంటర్లలో శిబిరాలు ప్రారంభించేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా శిబిరాలను స్థానిక శాసన సభ్యులతో, స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయించాలని కలెక్టర్ సూచించారు. కంటి అద్దాలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో టాం టాం ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలు పెద్ద ఎత్తున శిబిరాలకు వచ్చేలా చూడాలన్నారు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా విజయవంతం చేసి జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ సూచించారు. శిబిరాలకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ వారి ఆధార్ కార్డుతో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ ఉదయం 9గంటలకే శిబిరాలను తెరవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్య అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు నిప్పు.. ఎవరిది తప్పు?

- కాలి బూడిదవుతున్నా పట్టించుకోని అధికారులు

నవాబుపేట: ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ఇరువైపులా నాటిన హరిత హారం మొక్కలు అగ్నికి బూడిద అవుతున్నాయి. ప్రతి ఏడాది రోడ్ల పక్కన నాటుతున్న మొక్కలు ఇలా దగ్ధమవుతున్నా ఎవరికీ పట్టడంలేదు. వర్షాకాలం ప్రారంభం కాగానే అధికారులు కాలిపోయిన వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటుతున్నారు. అధికారులు కేవలం లెక్కల కోసమే మొక్కలు నాటుతున్నారే తప్ప వాటి సంరక్షణ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లకు ఇరువైపులా హరిత హారం మొక్కలతో సమానంగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించడంలేదు. గడ్డి ఎండగానే ఎవరో ఒకరు గడ్డిని తగులబెడుతున్నారు. దీంతో గడ్డితో పాటు మొక్కలు కూడా కాలి బూడిద అవుతున్నాయి. ఇటీవల వట్టిమీనపల్లి, ఎల్లకొండ, గొల్లగూడ, నారెగూడ గ్రామాల్లో అదే విధంగా గడ్డితో పాటు హరిత హారం మొక్కలు కాలిబూడిద అయ్యాయి. అయినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నారెగూడలో రోడ్డు పక్కన గడ్డితోపాటు తగలబడుతున్న మొక్కలు

కరీంనగర్ వెళ్లిన పీఏసీఎస్ చైర్మన్లు



చొప్పదండి సొసైటీ వద్ద చైర్మన్లు

కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు బుధవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. ముల్కనూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించారు. కరీంనగర్ జిల్లాలోని పలు పీఏసీఎస్‌లను పరిశీలించారు. సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. సహకార సంఘాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల గురించి పలువురు వక్తలు వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ డీసీసీబీ ఆధ్వర్యంలో విషయ పరిజ్ఞాన యాత్రకు వెళ్లినట్లు కొడంగల్ పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశానికిగాను అడ్మిషన్ టెస్ట్ ప్రకటన వెలువడినట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఏప్రిల్ 08 నుంచి వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ పొందవచ్చునన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

చిలుకూరు సన్నిధిలో యూపీ డిప్యూటీ సీఎం

మొయినాబాద్: చిలుకూరు బాలాజీని బుధవారం ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. వారణాసిలోని జ్ఞానవాసి దేవాలయంలో జరుగుతున్న వివాదానికి, చిలుకూరు బాలాజీ స్వామి వారి పిటిషన్‌కి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మద్దతు తెలపాలనే సందేశాన్ని అందజేయాలని రంగరాజన్ కోరారు. స్వామివారి ఆజ్ఞగా భావించి తప్పకుండా తెలుపుతా మని బ్రజేష్ పాఠక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని శివాలయాన్ని దర్శించారు.



క్లుప్తంగా

రబీ పంటల పరిశీలన



కేరెళ్లిలో ఉల్లి పంట వివరాలు నమోదు చేసుకుంటున్న డీఏఓ గోపాల్

ధారూరు: మండలంలోని బాచారం గ్రామంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రబీ పంటలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ వ్యవసాయ విస్తరణ అధికారి సుజాతతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేరెళ్లి గ్రామ రైతు సాగు చేసిన చామంతి, ఉల్లి, పసుపు పంటలకు సంబంధించిన ఫొటోలు, వాటి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. తర్వాత బాచారం గ్రామ రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించిన ఆయన వివరాలను నమోదు చేసుకున్నారు. డీఏఓ వెంట ఏఈఓ సుజాత, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంచంద్రా రెడ్డి, రైతులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ



బాధితున్ని పరామర్శిస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ బుధవారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం ఇందూర్ గ్రామానికి చెందిన మాసప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన విషయం తెలిసిందే. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. తన వంతుగా ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. ఆయనతో పాటు బీసీ సంఘం నాయకులు బాలు, భాను, విజయ్, రాజు, రాము, హరీష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి క్రికెట్‌లో శ్రీనివాస్ ప్రతిభ

- గోవాలో జరిగిన టీ–10 మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ ప్రదర్శన
- మ్యాన్ ఆఫ్‌ది ప్లేయర్‌గా ఎంపిక



ట్రోఫీతో శ్రీనివాస్

బషీరాబాద్: టీ–10 జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లో బషీరాబాద్ యువకుడు ప్రతిభ చాటాడు. మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన పోషమొళ్ల శ్రీనివాస్ బుధవారం గోవాలో జరిగిన టీ–10 జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ టీం తరఫున పాల్గొన్న శ్రీనివాస్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించారు. గోవా స్పోర్ట్స్ కార్యదర్శి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది ప్లేయర్ అవార్డు అందుకున్నారు. త్వరలో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కి తెలంగాణ నుంచి ఇద్దరు క్రికెటర్లను ఎంపిక చేశారని, అందులో తాను కూడా ఉన్నట్లు సాక్షితో చెప్పారు. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ క్రికెట్ టోర్నమెంట్లలో పాల్గొంటున్నట్లు తెలిపాడు. తమ గ్రామ యువకుడు జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనడం తమకు ఎంతో గర్వంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పోలెపల్లి జాతరకు ఏర్పాట్లు షురూ..

- నెల రోజుల ముందుగానే పనులు
- ఫిబ్రవరి 9నుంచి ఉత్సవాలు



మూలవిరాట్టు



ముస్తాబవుతున్న పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం

బొంరాస్‌పేట: మావురాల మాతగా పూజలందుకుంటున్న పోలెపల్లి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నెల రోజుల ముందుగానే పనులు చేపట్టారు. ఫిబ్రవరి 9నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన పోలెపల్లి ఎల్లమ్మ తల్లిని ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు దర్శించుకొని తరిస్తున్నారు. దేవస్థానం ఏర్పాటు కాక ముందు నుంచి ఓ కథ ప్రచారంలో ఉంది. ఐదు శతాబ్దాల క్రితం ఈ ఆలయ స్థలంలో రైతు గడెం పనులు చేస్తుండేవాడు. భూమి చదును చేసేందుకు గుంటకపై బరువైన రాయిని ఉంచేవాడు. పనులు పూర్తి కాగానే ఆ రాతిని గట్టున ఉంచి ఇంటికి వెళ్లేవాడు. మరుసటి రోజు పొలానికి వచ్చి చూడగా గట్టున ఉంచిన రాయి పొలం మధ్యలో ఉండేది. తరచూ ఇలా జరుగుతుండేది. ఒక రోజు రైతుకు కలలో అమ్మవారు కనిపించింది. నేను మహిమ గల మావురాల తల్లిని ఇక్కడే స్థిర నివాసం ఉంటాను.. భక్తుల కోర్కెలు తీరుస్తూ పూజలందుకుంటాను. ఆలయం కట్టు భక్తుడా.. అని చెప్పింది. దీంతో రైతు చిన్నపాటి ఆలయాన్ని నిర్మించాడు. ప్రస్తుతం అది దేవస్థానంగా విరాజిల్లుతోంది.

పాపాలను రూపుమాపే పసుపు బండారు

ఎల్లమ్మ జాతరకు శాస్త్రీయ నేపథ్యం ఉందని చెప్పవచ్చు. పూర్వం వైద్యశాస్త్రం ఇంతగా అభివృద్ధి చెందని కాలంలో ఆయుర్వేద వైద్యమే అందుబాటులో ఉండేది. తట్టు, మసూచి, ఇతర చర్మ వ్యాధులకు వేపాకు, పసుపుతో చికిత్స చేసేవారు. గ్రామ దేవతల్లో ఒకరైన ఎల్లమ్మ ఇలాంటి వ్యాధులకు చికిత్స చేసేదనే నానుడి. అమ్మవారికి ఇష్టమైన పసుపు బండారు, వేపాకులు ధరిస్తే రోగాలు, పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

బోనపు నైవేద్యాలు

జాతరలో ప్రత్యేకంగా బోనాలు, బ్యాండు మేళాలు, డప్పులతో, పూనకాలతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. నుదుటికి పసుపు, కుంకుమ తిలకాలు, తెల్లని, పసుపురంగు వస్త్రాలు ధరించి తమ ప్రత్యేక భక్తిని చాటుకుంటారు. ఈ జాతరలో బోనాల పూజలు ప్రత్యేకం.

సిడే ఘట్టమే ప్రధానం

బ్రహ్మోత్సవాల రెండో రోజు శుక్రవారం సాయంత్రం జరిగే 'సిడే' ఘట్టం ప్రత్యేకను చాటుతోంది. ఈ ఘట్టమే మావురాల తల్లికి మకుటంగా నిలుస్తోంది. దీన్ని తిలకించి తరించడానికి లక్షలాది భక్తులు తరలివస్తారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన సిడేపై తొట్లాలలో ఉంచి దాదాపు 50 అడుగుల ఎత్తులో ఉంచి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తారు. గవ్వల బండారు చల్లుతూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు.

జాతర కార్యక్రమాలు

ఫిబ్రవరి 9 గురువారం రాత్రి పల్లకీ సేవ నిర్వహిస్తారు. శుక్రవారం జాతర ప్రధాన ఘట్టమైన సిడే (రథోత్సవం) ఉంటుంది. శనివారం ఉదయం తేరు లాగే కార్యక్రమం, ఆదివారం భక్తుల ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రేపు బహిరంగ వేలం

ఈ నెల 20వ తేదీ ఉదయం 11.30గంటలకు అమ్మవారి దేవస్థానం కార్యాలయం ఎదుట బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి తెలిపారు. జాతరలో టెంకాయలు అమ్ముకునేందుకు (ఏడాది పాటు) వేలం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో టెంకాయల వేలం ఫిబ్రవరి 9నుంచి 24వరకు కాలపరిమితి ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు విక్రయించడానికి రూ. 50 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది.

ఆలయ అభివృద్ధి



ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. జాతరకు ప్రతి ఏటా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, బివండి, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం.

– బుగ్గప్ప, రేణుక ఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు

మరో జోగులాంబ దేవస్థానంగా..



ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ రూ. 25లక్షలు మంజూరు చేసింది. భక్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం, మండపాలు తదితర పనులు పూర్తి చేశాం. ఆలయాన్ని మరో జోగులాంబ దేవస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– వెంకటేశ్, ఆలయ పునరుద్ధరణ కర్త

గొడవలు సృష్టిస్తే కేసుల నమోదు

ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి



తాండూరు రూరల్: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోటబాసుపల్లిలో రెండు వర్గాల మధ్య దాడి నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని ఓ హోటల్ వద్ద గుర్రంపల్లి రమేష్ కూర్చున్నాడు. అటుగా వెళుతున్న వడ్డె మహేష్.. రమేష్‌ను చూశాడు. నన్ను ఎందుకు చూస్తున్నావురా అని గొడవ పడ్డాడు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత రెండు వర్గాల వారు దాడి చేసుకొని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గుర్రంపల్లి రమేష్ ఫిర్యాదు మేరకు వడ్డె మహేష్, బద్రి, నాగప్ప, తిరుపతి, బాలస్వామి, చిన్నా, రాములుపై కేసులు నమోదు చేశామన్నారు. వడ్డె మహేష్ ఫిర్యాదుతో గుర్రంపల్లి అరుణ్, ఈడ్గి నందు, ఈడ్గి సోను, గుర్రంపల్లి రాఘవేందర్, గుర్రంపల్లి చిన్న, గుర్రంపల్లి రవి, గుర్రంపల్లి నవీన్, మంగళి శ్రీకాంత్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెట్టుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, జల్సాలకు అలవాటు పడితే హెచ్చరించాలని పేర్కొన్నారు. యువత చెడిపోతే తల్లిదండ్రులదే బాధ్యత అని అన్నారు. కోటబాసుపల్లిలో మరోసారి గొడవ జరిగితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తానని హెచ్చరించారు.

పేరుకే వ్యవసాయ కార్యాలయం

- నిత్యం తాళమే
- రైతు వేదికల్లోనూ కనిపించని అధికారులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు



తాళం వేసిన ధారూరు వ్యవసాయ కార్యాలయం

ధారూరు: మండల వ్యవసాయ కార్యాలయం తలుపులు తెరచుకోవడం లేదు. నిత్యం తాళంతో దర్శనమిస్తోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఏడుగురు ఏఈవోలు ఉన్నారు. ప్రస్తుతం వీరు రైతు వేదికల్లో ఉన్నామని చెబుతున్నా అక్కడ కూడా కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధారూరు ఏఈఓ మాత్రమే రైతు వేదికలో కనిస్తున్నట్లు తెలిసింది. అయితే క్షేత్రస్థాయి పంటల పరిశీలన, నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అటెండర్ అందుబాటులో ఉంటే కార్యాలయానికి వచ్చే రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. గతంలో ఏఓ, ఏఈఓ సొంత డబ్బు ఇచ్చి మహిళా అటెండర్‌ను నియమించారు. ఇటీవల ఆమె మరణించింది. దీంతో కార్యాలయానికి తాళం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఖాళీ పోస్టును భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి



శివకుమార్(ఫైల్)

నవాబుపేట: అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆర్కతల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్కతల గ్రామానికి చెందిన అంజయ్య పెద్ద కుమారుడు శివకుమార్(16) నవాబుపేటలోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పొలానికి నడుచుకుంటూ వెళ్లాడు. గంట తర్వాత తండ్రి అంజయ్య పొలం వద్దకు వెళ్లగా బాలుడు విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని బుద్లాపూర్ భగత్‌సింగ్ యూత్ సభ్యులు బుధవారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి నేటికీ వాటిని ఆచరణలోకి తీసుకురాలేదని అన్నారు. గ్రామీణ ప్రాంత యువత ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుగుతున్నా సీఎం కేసీఆర్‌కు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం టీఆర్ఎస్ నేతలకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. రాబోవు రోజుల్లో మరింత మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం పరిగి మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎర్రగడ్డపల్లి జగన్, భగత్‌సింగ్ యూత్ సభ్యులు తుకారం, శివ, సంతోష్, వెంకటేశ్, గణేశ్, అనిల్, పరుశురాం, రాజు, కె.రాజు, వసురాం పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది వల్లే వ్యాపారి ఆత్మహత్య

- బంధువుల ఆరోపణ
- తాండూరు బస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం
- మృతదేహంతో బంధువుల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు
- ఆత్మహత్యపై విచారణ చేస్తామన్న సీఐ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ, ఆర్టీసీ అధికారులు

తాండూరు: ఆర్టీసీ సిబ్బంది తీసుకున్న నిర్ణయం వల్లే చిరు వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో చిరు వ్యాపారి చిరంజీవి డబ్బా పెట్టుకొని వ్యాపారం చేస్తున్నాడు. అద్దె చెల్లించలేదని ఆ శాఖ అధికారులు డబ్బాను సీజ్ చేశారు. ఉపాధి కోల్పోయిన వ్యాపారి మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో తాండూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిరంజీవి మరణానికి ఆర్టీసీ అధికారులే కారణమంటూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంతో ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న డిపో అధికారులు తాండూరు సీఐ రాజేందర్‌రెడ్డికి వివరించారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సైలు మధుసూదన్‌రెడ్డి, వేణుగౌడ్, మహిపాల్‌రెడ్డి, పోలీసులు బస్‌స్టేషన్ వద్ద బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు తాండూరుకు చేరుకున్నారు. అయితే వారిని రైల్వే బ్రిడ్జి వద్దే పోలీసులు అడ్డగించారు. ఆర్టీసీ అధికారుల తీరు వల్లే చిరంజీవి మరణించాడని మృతుడి భార్య మేర్సెమ్మ సీఐ ఎదుట మొరపెట్టుకుంది. అద్దె కడతామని చెప్పినా వినకుండా తాళం వేశారని తెలిపింది. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తాము కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. అనంతరం మృతుడి ఒంటిపై ఉన్న ఆధారాలను సేకరించారు. డిపో ఎదుట గొడవ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని సీఐ నచ్చజెప్పారు. దీంతో శాంతించిన మృతుడి కుటుంబ సభ్యులు చిరంజీవి మృతదేహాన్ని స్వగ్రామమైన గద్వాల జిల్లా బుడిదపాడు గ్రామానికి తీసుకెళ్లారు.

ఆర్టీసీకి ప్రమేయం లేదు

చిరు వ్యాపారి చిరంజీవి ఆత్మహత్యకు తాండూరు ఆర్టీసీ డిపో అధికారులకు ఎలాంటి ప్రమేయం లేదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆత్మహత్య చేసుకున్న చిరంజీవికి డబ్బా నిర్వహించుకునేందుకు ఎలాంటి లైసెన్స్ జారీ చేయలేదని పేర్కొన్నారు.

ఎస్పీకి పితృవియోగం

అనంతగిరి: ఎస్పీ కోటిరెడ్డికి పితృవియోగం కలిగింది. తండ్రి హనుమారెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం స్వగ్రామం సూర్యాపేట జిల్లా మాధవాపురం గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు జిల్లా పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ప్లీడర్‌గా రవీందర్‌రెడ్డి



తాండూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా రవీందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాండూరు న్యాయస్థానంలో న్యాయవాదిగా కొనసాగుతున్న రవీందర్‌రెడ్డికి అసిస్టెంట్ ప్లీడర్‌గా అవకాశం కల్పించారు. ఇందుకు గాను ప్రతి నెలా రూ.20 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. న్యాయవాది రవీందర్‌రెడ్డిని తాండూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన నర్సింహ(46) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. హబ్సిగూడ ప్రాంతంలో ప్రైవేట్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో నివాసముంటున్నాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో నర్సింహ గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున కన్నుమూశాడు.

ఛత్రపతి శివాజీ సేవలు మరువలేనివి

మర్పల్లి: హిందూ ధర్మ పరిరక్షణకు 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ చేసిన సేవలు మరువలేనివి బర్దిపూర్ ఆశ్రమ అవదూత గిరి మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లిలో మాడుగుల సర్వోత్తమ శర్మ, విగ్రహ దాతలు కొత్తపల్లి లక్ష్మి సాంబిరెడ్డి, సురేందర్ కుమార్, బీచ్‌కుంట మఠం సోమేశ్వర శివాచార్య మహాస్వామితో కలిసి ఛత్రపతి శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ చిన్నతనంలోనే హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఎంతగానో పాటుపడ్డ మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే తుమ్మలపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహం రెండో అతి పెద్దదన్నారు. యువత చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని, శివాజీ చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో తంగెడపల్లి ఆశ్రమ శివయోగి శివాచార్య మహాస్వామి, రంజోల్ పీఠం రాచన్న స్వామి, అన్నదాత పట్లోళ్ల శంకర్ పటేల్ పాల్గొన్నారు.

డీజిల్ దొంగల ముఠా అరెస్టు

- డీసీఎం వ్యాన్, రూ. 45 వేలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కుశాల్కర్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కుశాల్కర్

కొత్తూరు: జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపిన వాహనాల్లో నుంచి డీజిల్ దొంగిలిస్తున్న ముఠాను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. గుజరాత్ నుంచి చెన్నైకు ప్లాస్టిక్ ముడిసరుకుతో వెళ్తున్న రెండు లారీలను ఈ నెల 11న తెల్లవారుజామున కొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన డ్రైవర్లు నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో లారీల వెనకాల శబ్దం రావడంతో మేల్కొని గమనించగా.. అప్పటికే కొందరు దుండగులు లారీల ట్యాంకులను ధ్వంసం చేసి డీజిల్‌ను చోరీ చేసి డీసీఎం వ్యాన్‌లో పారిపోయారు. ఈ విషయమై వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాత్రి కొత్తూరు పారిశ్రామికవాడ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. చేతిలో గడ్డపార, డీసీఎం వ్యాన్‌లో అనుమానాస్పదంగా ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నసీబ్‌ఖాన్(42), ముబారక్‌ఖాన్(38), బీరంసింగ్ వర్మ(38)లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో వారు డీజిల్ చోరీ చేస్తున్న విషయాన్ని అంగీకరించారు. వీరు చోరీ చేసిన డీజిల్‌ను కొనడంతో పాటు వారికి పలు విధాలుగా సహకరిస్తున్న శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఎండీ అన్వర్(40)ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరి నుంచి రూ.45 వేల నగదు, డీసీఎం వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ నలుగురు 12 ఏళ్ల నుంచి ఈ విధమైన చోరీలకు పాల్పడి, జైలుకు సైతం వెళ్లినట్లు గుర్తించారు. కొత్తూరు సీఐ బాలరాజు ఆధ్వర్యంలో కేసును ఛేదించిన ఏఎస్‌ఐ అబ్దుల్లా, సిబ్బంది నరేందర్, లింగుస్వామి, మహిపాల్, హరీశ్, రవీందర్‌నాయక్‌లను ఏసీపీ అభినందించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొండయ్య తదితరులు

టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య

బంట్వారం: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టాలని టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బంట్వారం మోడల్ స్కూల్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా మోడల్ స్కూళ్లలో బదిలీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 30మంది రెగ్యులర్ టీచర్లు వివిధ కారణాలతో మరణించారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఆ కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సహకారం అందలేదన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జహంగీర్, సంఘం బాధ్యులు సంతోష్, గోపాలకృష్ణ, రమేష్, స్వప్న, పుష్పలత, కల్పన, కులకర్ణి, సతీష్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు విద్యార్థులు

మోమిన్‌పేట: మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఏఎన్ఐటీ)లో ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్)–2022కు ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఫెస్టివల్ సందర్భంగా స్టూడెంట్ సైన్స్ విలేజ్‌లో జరగబోయే వివిధ ప్రదర్శనలను పరిశీలించడానికి ఇర్విన్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు కే వైష్ణవి, ఆర్ చరణ్‌తేజ, శ్రోహిత్‌కుమార్, జునైద్, జశ్వంత్‌లు బుధవారం పాఠశాల నుంచి బయలుదేరి వెళ్లారు. విద్యార్థులను సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీలు కొప్పుల తిరుపతమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి అభినందించి వీడ్కోలు పలికారు.